# నాకునువ్వు నీకునేను

తలుపు దభీమని మూసిన చప్పుడైంది. ఆ వెంటనే బయటనించి ఆడవాళ్ళ నవ్వులూ, తలుపు గొళ్ళెంపెట్టిన శబ్దం సన్నగా వినిపించాయి.

తర్వాత... కొన్ని క్షణాల నిశ్శబ్దం!

"అక్కడే నిలబడిపోయావేం?... ఇలా దగ్గరకు రావచ్చు" ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినిపించాయి అతని మాటలు.

మళ్ళీ కొన్నిక్షణాల నిశ్శబ్దం.

"నిన్నే... సిగ్గా?" అడిగాడతను.

'ఊహుం... కాదు!" ఆమె చెప్పింది.

"మరి అలా తలవంచుకుని, బొటనవేలు నేలమీద అరగదీస్తూ ఆ తలుపుదగ్గరే నిలబడిపోతే ఎలా? చూడు... ఇది సిగ్గుపడే సమయం కాదు... సిగ్గుని విడిచిపెట్టాల్సిన సమయం! మనిద్దరికీ మన పెద్దవాళ్లు స్వేచ్ఛనిచ్చేశారు. ఏమైనా మాట్లాడుకోవచ్చు. ఏదైనా చేసుకోవచ్చు" చెప్పాడతను.

"ఏం చేస్తారూ?" ఆమె ప్రశ్నలో కొంటె తనం ధ్వనించింది.

"అబ్బో... పల్లెటూరి పిల్లవనుకున్నాను... చమత్కారంగా మాట్లాడటం కూడా వచ్చునే! అయినా నువ్వలా తలవంచుకుని అక్కడే నిలబడిపోతే ఇంక నేనేం చెయ్యాలీ? సిగ్గు చాలించి ఇలా వచ్చెయ్... రావా?... సరే!... మూడంకెలు లెఖ్ఖపెడతాను... ఆలోగా బుద్ధిగా వచ్చి, నన్ను కౌగిలించుకోవాలి? లేకపోతే నేను ఈ తలగడా, ఆ చాపా తీసుకుని, పెరట్లోకెళ్లి పడుకుంటా... ఆ తర్వాత నీ ఇష్టం... సరేనా? లెఖ్ఖ పడుతున్నా... ఒకటి... రెండు.... ఆ... గుడ్!... అదీ... పతి భక్తి అంటే అలా వుండాలి..."

గాజుల శబ్దం వినిపించింది...

"అయ్యయ్యో... ఇదేమిటీ?... పాదాలకు నమస్కారం పెడుతున్నావెందుకూ?" అడిగాడతను.

"మీరే అన్నారుగా 'పతిభక్తి' అని!... పైగా మా అమ్మ చెప్పింది... పెళ్ళయిన ఆడదానికి ఎప్పుడూ భర్త పాదాలదగ్గరే చోటుండాలట!"

"ఇంకా నయం - ఈ పాదాలకు రోజూ అభిషేకం చేయమని చెప్పలేదు... లే!... ఇలా నా పక్కన కూచో... ఊఁ!"

"పాలు తీసుకోండి చల్లారిపోతాయేమో!" - మళ్లీ గాజుల చప్పుడుతో సహా ఆమె గొంతు వినిపించింది...

"అయితే ఇక నిద్రపోరా?"

"అబ్బా... ఏమిటి సుందరి!. పాలు, పతిభక్తి... నిద్రా - అంతేనా? ఇంక మాట్లాడేందుకు ఏమీ లేవా? అసలు మనిద్దర్నీ ఇలా గదిలోకి పంపించి - బయట గొళ్లెం పెట్టింది కడుపునిండా పాలుతాగేసి - కమ్మగా నిద్రపొమ్మని కాదు... కావాల్సినన్ని కబుర్లు చెప్పుకోమని!"

'పోనీ... ఈ సున్నుండైనా తినండీ?... మా అమ్మ ఎంతో కష్టపడి చేసింది"

"నాకు తినాలనిపించటం లేదు... నీకు తినాలనిపిస్తే తిను" కొంచెం నిష్టూరంగా వినిపించాయి అతని మాటలు.

"వద్దులెండి!... నాకూ తినాలనిపించటం లేదు!" చెప్పిందామె.

"వెరిగుడ్!... భార్యాభర్తల ఆలోచనలు ఎప్పుడూ ఒకేలా ఉంటే - ఆ కాపురం గుడి గోపురమవుతుందట!"

మళ్లీ కొన్ని క్షణాల నిశ్శబ్దం...

"మీరు కథలు రాస్తారటగా?" అడిగిందామె.

"ఎవరు చెప్పారు?"

"మా అన్నయ్యకి - వాళ్ళ ఫ్రెండు చెప్పాడట... అన్నయ్య నాకు చెప్పాడు!"

"ఏదో... రెండు కథలు రాశాను... అంతే!... ఇక రేపట్నించీ బోలెడన్ని రాస్తాను... ఎలా రాస్తానని అడగవేం?"

"అవును... ఎలా రాస్తారూ?" అడిగింది.

"నీ కళ్ళల్లోకి చూస్తుంటే - ఈ కళ్లు నాకెన్నో కథలు చెప్తాయిగా" ముద్దుపెట్టుకున్న శబ్దం వినిపించింది...

"ఇదేమిటీ? కళ్ళను ఎవరైనా ముద్దుపెట్టుకుంటారా?"

"ఏమో... నాకు అనిపించింది. పెట్టుకున్నాను...!"

"గొప్పే!"

"గొప్ప కాదు సుందరీ... నిజం చెప్తున్నా... నువ్వెంత అందంగా వున్నావో - నా కళ్లలోకి చూడు తెలుస్తుంది... ఆ రోజు మన పెళ్లిచూపుల తర్వాత ఇంటికొచ్చి నా 'డైరీ'లో ఏం రాసుకున్నానో తెలుసా?"

"ఏం రాసుకున్నారూ?"

"పేరుకి తగినట్టుగానే సుందరి చాలా అందంగా ఉంది... ఇంత అందమైన ఆడపిల్ల నేను చదువుకున్న స్కూల్లోనూ, కాలేజీలోనూ కూడా కనిపించలేదు... మంచు తెరల మధ్య కనిపించే సెలయేరు కంటే బావుంది... వెన్నెల వెలుగుల్లో ఉవ్వెత్తున లేచిపడే సముద్రకెరటమంత అందంగా వుంది... మండు వేసవికి మంగళహారతి పడుతూ మెరిసే తొలకరి వానకంటే ఎన్నిరెట్లో అందంగా వుంది' అని రాసుకున్నాను" చెప్పాడతను.

ఆమె గలగలా నవ్వేసింది...

"నవ్వుతావెందుకూ?" అడిగాడు.

"అప్పుడే మీకు కథలు పుట్టుకొచ్చేస్తున్నాయనీ!" - అలా నవ్వుతూనే చెప్పిందామె.

"నో...కథలూ, కల్పనలూ కాదు సుందరీ! నా మనసులో మాటలవి!" మావాళ్లు అడిగినంత కట్నం - మీ నాన్న గారు 'ఇచ్చుకోలేన'న్నా - నీ అందాన్ని చూసీ, పూలవాకిళ్ల వంటి - ఇవిగో... ఈ కళ్లు చూసీ మా వాళ్ళను ఒప్పించాను".

"మీరూ అందంగానే ఉన్నారు... మీ గిరజాల జుట్టు బావుంది... మొన్న టీవీలో చూశాను. షావుకారు సినిమాలో ఎన్టీఆర్ జుట్టుకూడా ఇలాగే ఉంటుంది!" కొంచెం సిగ్గుపడుతూ చెప్పిందామె.

"అయితే నేను నీకు బాగా నచ్చానన్న మాట?"

"బాగా నచ్చటం ఒకటీ - మామూలుగా నచ్చటం ఒకటీ వేర్వేరుగా ఉంటాయా?" అమాయకంగా ప్రశ్నించింది.

"ఆహా?... బాగా నచ్చటం అంటే - పిచ్చి పిచ్చిగా నచ్చేయటం...! ప్రేమించినవాడి కోసం సర్వస్వం త్యాగం చేసేసి అయినవాళ్ళనందర్నీ 'ఆఫ్టాల్' కింద తీసిపారేసి - రాత్రికి రాత్రి ఆ ప్రియుడితో హౌరా మెయిల్ ఎక్కేసి చెక్కేయటాన్కి సైతం వెనకాడకపోవటం!"

"మామూలుగా నచ్చటం అంటే?" వెంటనే అడిగిందామె.

"అంటే - ఏదో, పర్వాలేదులే... ఎడ్జెస్టయిపోవచ్చు... ఓ వెయ్యి రూపాయలు సంపాదించుకుంటున్నాడు... నెలకో సినిమా చూపించకపోతాడా? వారానికో మూరెడు మల్లెపూలదండ తేలేకపోతాడా? ఏడాదికో నూలుచీర కొనిపెట్టకపోతాడా' అనుకుని తల్లీతండ్రీ తెచ్చిన సంబంధాన్ని 'ఒకే' చేసి - మెడవంచుకుని మూడుముళ్లూ వేయించేసుకోవటం... అదన్నమాట?"

ఆమె మళ్లీ గలగలా తెరలు తెరలుగా నవ్వేసింది.

"అబ్బ... నువ్వు నవ్వితే ఎంత బాగున్నావ్ సుందరీ?" తన్మయపూర్వకంగా ఉన్నాయతని మాటలు.

"ఊఁ!... పొగడ్తలు చాలుకానీ... పాలు తాగండీ... చల్లారిపోతున్నాయి!"

"అబ్బా... కాసేపు ఆ పాలసంగతి మర్చిపో సుందరీ... అవి ఎప్పుడు తాగాలో నాకు తెలుసు... అసలు మొదటిరాత్రి - పట్టెమంచం పక్కన ఇలా పాలగ్లాసు ఎందుకు పెడతారో నీకు తెలుసా?" అడిగాడతను.

"పాలు ఆరోగ్యానికి మంచివి!... మా సైన్స్ మాస్టారు చెప్పారు!"

"అది సైన్సు పాఠం... కానీ ఇందులో మరో - జీవిత పాఠం కూడా ఉంది!"

"జీవితపాఠమా?"

"ఎస్... ఇప్పుడు ఈ పాలల్లో నీళ్లుంటాయి కదా?"

"వుండవు... ఈ పాల్లో అస్సలు నీళ్ల లేవు... ప్రతిరోజూ మా పక్కవీధిలో పాపయ్య తన గేదెను మా ఇంటికి తీసుకొచ్చి - మా కళ్ళముందే పాలు పితుకుతాడు... నీళ్లు ఒక్క చుక్కయినా కలపడు!" సీరియస్‌గా చెప్పిందామె.

"అతను కలపకపోయినా... ఆ గేదె అంతకుముందు నీళ్లు తాగుతుంది కదా! అవి కలుస్తాయి... అదన్నమాట! కనుక ఆ నీళ్లూ పాలూ ఒక్కటిగా కల్సిపోయి - ఏకరూపమై కన్పించినట్టు భార్యాభర్తలిద్దరూ అరమరికలు లేకుండా ఒక్కటిగా కల్సిపోవాలని తెలియచెప్పటానికే - ఇలా మొదటిరాత్రి పాలగ్లాసు పెడతారు... ఇందులో అర్ధనారీశ్వర తత్వం ఇమిడి ఉంది!"

"ఏమో బాబూ... నాకు ఆ పోలిక బొత్తిగా నచ్చదు!"

"ఏం? ... ఎందుకనీ!" అడిగాడు.

"భార్యాభర్తలిద్దరూ - పాలూ, నీళ్లులా కలసిపోవాలీ' అంటే, ఆ ఇద్దర్లో ఎవరో ఒకరు పాలూ - రెండోవారు నీళ్లూ అనే కదా అర్ధం? మరి అలాంటపుడు ఇద్దరి మధ్యా అంతటి అంతరం ఉంటే కలసిమెలసి వుండటం ఎలా సాధ్యం."

"మంచి పాయింటే పట్టుకున్నావ్! కానీ... నా ఉద్దేశ్యంలో, భార్యాభర్తలిద్దరూ... ఇలా కౌగిళ్ళలో కరిగిపోతూ - కలసిమెలసి కాపురం చేస్తేనే కదా పిల్లలు పుట్టేది?... అవునూ... నీ కసలు పిల్లలంటే ఇష్టమేనా?

"పిల్లల్నీ- పువ్వుల్నీ ఇష్టపడని ఆడవాళ్లు ఎక్కడైనా ఉంటారా? అసలు ఎందుకలా అడిగారూ? కొంపదీసి మీకు ఇష్టంలేదా?" అడిగిందామె ఆదుర్దా నిండిన స్వరంతో.

"చాలా ఇష్టం... ముఖ్యంగా మగపిల్లలంటే మరీ మరీ ఇష్టం.. వీధిలోకి వెళ్లి మపకి ఆపనీ ఈపనీ చేసుకొస్తారు... మనం పెద్దవాళ్లమయ్యే సరికి - చేతికందొస్తారు... చేతినిండా డబ్బులు పోస్తారు".

"ఏమో బాబూ!.... నాకు ఆడపిల్లలంటేనే ఇష్టం... ఇంట్లో ఎంతో సాయంగా ఉంటారు... నేను మా అమ్మకి ఇంట్లో ఎన్ని పనులు చేసిపెడతానో తెలుసా? ఇప్పుడు నేను మీతో వచ్చేస్తే మా అమ్మ ఎంత బెంగ పెట్టేసుకుంటుందో?"

"కానీ మనకు ముందు మగపిల్లాడే పుడతాడు!" దృఢంగా చెప్పాడతను.

"ఏం? ఆడపిల్ల పుట్టకూడదా?" అడిగిందామె.

"పుట్టదు.... పుట్టదు కాక పుట్టదు! 'మళ్ళీ ఏడాది ఈ రోజుకి దబ్బపండు లాంటి అబ్బాయిని ఎత్తుకోవాలి' అని ఇందాక దంపతి తాంబూలం తీసుకుంటూ మా అత్తయ్య ఆశీర్వదించింది. గుర్తుందా? ఆవిడ నాలుకమీద పుట్టుమచ్చ ఉందిట. అందుకని ఆవిడ ఏవంటే అది జరిగిపోతుంది. కాబట్టి మనకి మగపిల్లాడే ఖాయం... మగపిల్లాడు పుట్టగానే గ్రాండ్‌గా బారసాల జరిపి...."

'టక్... టక్'... మాటలు ఆగిపోయి 'శబ్దం' వినిపించింది...!

అంతవరకూ, పడక కుర్చీలో కళ్ళుమూసుకుని టేప్‌రికార్డర్ లోంచి వస్తున్న మాటలు వింటూ ఒక రకమైన తన్మయత్వాన్ని అనుభవిస్తూ పడుకున్న రాఘవయ్య ఉలిక్కిపడి, కళ్ళు తెరిచి చూశాడు.

ఎదురుగా కూర్చున్న సుందరమ్మ చేతిలో 'టేప్‌రికార్డర్' ఉంది. ఆమె కళ్ళల్లో కన్నీరు మెరుస్తోంది.

"ఏమిటి సుందరమ్మా! టేప్ రికార్డర్ ఆపేశావెందుకు? అరె... కళ్ళల్లో ఆ నీళ్ళేమిటీ?" ఆమెను చేరుకుని ఆందోళనగా అడిగాడు రాఘవయ్య.

"ఆఁ?... అబ్బే.... లేదండీ.... ఏం లేదు!" పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నంలో చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ చెప్పిందామె...

"నాకు తెలుసు!... మనకి పిల్లలు పుట్టలేదనే కదా, నీ దిగులూ? అందుకే ఓ పిల్లాణ్ణి ఎవర్నైనా తెచ్చి పెంచుకుందామని ఎన్నోసార్లు అడిగాను... నువ్ ఒప్పుకోలేదు!" ఆమె పక్కనే కూర్చుని ఆప్యాయంగా, భుజంపై చేయి వేస్తూ అన్నాడు రాఘవయ్య.

సుందరమ్మ విరక్తిగా నవ్వింది. "పెంచుకున్న పిల్లలు - సొంత పిల్లలు ఎలా అవుతారండీ?... ఓసారెపుడో, ఓ పుస్తకంలో - మీరే ఓ కథ చదివి వినిపించారు. గుర్తుందా?"

అదేమిటో గుర్తుకురాక ప్రశ్నార్థకంగా చూశాడు రాఘవయ్య.

"ఒకామె పిల్లల కోసం తపస్సు చేస్తే - దేవుడు ప్రత్యక్షమై 'నీకు సంతాన యోగం లేదు. దానికి బదులు స్వర్గాన్ని ఇస్తాన్లే' అన్నాట్ట. అపుడా ఇల్లాలు 'నాకు బిడ్డల్నే ప్రసాదించు' అని పట్టుపట్టింది. 'పోనీ బిడ్డలకు బదులు అమృతం ఇస్తాను తీసుకో' అన్నాడు దేవుడు.

అప్పుడు కూడా ఆ ఇల్లాలు ఒప్పుకోలేదు. 'ఒక్కడంటే ఒక్కడు... ఒక్క బిడ్డను ప్రసాదించు భగవాన్!' అంటూ దేవుని పాదాలపై వాలిపోయింది'' - సుందరమ్మ గొంతు మూగవోయి మరి చెప్పలేకపోయింది.

అప్పటికి ఆ కథ రాఘవయ్యకీ గుర్తు కొచ్చింది. 'బిడ్డ మీద నీకంత మమకారం ఎందుకమ్మా' అని దేవుడు అడిగితే 'నాకు మహా ఇస్తే స్వర్గం ఇస్తావ్, అమృతం ఇస్తావ్... కానీ ఒక్క బిడ్డ కలిగితే - ఆ పసిగుడ్డు కళ్లల్లో స్వర్గాన్నీ - చిరునవ్వులో అమృతాన్నీ కూడా పొందగలుగుతాను కదా స్వామీ' అందా ఇల్లాలు... కదూ? కానీ వాటిని పొందే అదృష్టం ఆ దేవుడు మనకి ఇవ్వలేదు సుందరమ్మా!'' దిగులు నిండిన స్వరంతో చెప్పాడు రాఘవయ్య.

"ఔనండీ!... 'పూజకొద్దీ పురుషుడూ, దానం కొద్దీ బిడ్డలు' అంటారు. నేను క్రితం జన్మలో మంచి పూజలు చేశానే తప్ప - దాన ధర్మాలు చేయలేదేమో!'' భారంగా నిట్టూర్చిందామె.

"పోన్లే సుందరమ్మా!... ఇవాళ ఆనందంగా మన ఏభయ్యో పెళ్లిరోజు చేసుకుంటూ - ఇంకా మనకి పిల్లలు పుట్టలేదని బాధపడటం దేనికి?... నీకో విషయం చెప్పనా?''

ఏమిటన్నట్టు చూసిందామె...

"మనకి ఒకవేళ పిల్లలు పుట్టి ఉంటే - మనిద్దరం ఇలా 'ఒకరికోసం మరొకరం' కాకుండా - ఆ పిల్లల కోసం జీవించాల్సిన వచ్చేది... అంటే నీ మీద నాకూ, నా మీద నీకూ ఉన్న ప్రేమలో కొంత భాగాన్ని వాళ్లకి పంచాల్సి వచ్చేది!'' - చెప్పాడు రాఘవయ్య.

'అవును... అదీ నిజమే!' ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా తల పంకించిందామె. వెంటనే మళ్లీ ఏదో గుర్తుకు వచ్చినదానిలా అడిగింది - "సరేగానీ రాఘవయ్య గారూ! ఈ టేపురికార్డరు ఏమిటీ... ఇందులో ఈ కేసెట్టు ఏమిటీ? అసలీ వయసులో ఈ కొంటెవేషాలేమిటి?''

'కొంటెవేషాలు కాదోయ్!... తీపి జ్ఞాపకాలు! వయసులో వేసేవి కొంటె వేషాలు... వయసైపోయాక మిగిలేవి తీపి జ్ఞాపకాలు... అదన్నమాట!''

"నేనడిగేది అదికాదు, ఈ క్యాసెట్ లోకి మన మొదటిరాత్రి మాటలన్నీ ఎలా వచ్చాయి అని అడుగుతున్నా'' క్యాసెట్ తీసి అటూ ఇటూ తిప్పి చూస్తూ అడిగిందామె.

రాఘవయ్య వెంటనే బదులు చెప్పలేదు... ఆమె చేతిలోంచి క్యాసెట్ తీసుకుని దానివైపు చూస్తూ - గతాన్ని గుర్తు చేసుకుంటున్నవాడిలా - కొన్ని క్షణాలు కళ్లు మూసుకుని తర్వాత చెప్పడం ప్రారంభించాడు.

"అప్పట్లో నాకు శేషగిరి అని ఓ ఫ్రెండుండేవాడు. ఫ్రెండంటే మామూలు ఫ్రెండు కాదు... మేమిద్దరం ప్రాణస్నేహితులం! నిజంగానే ఒక కంచంలో తిని, ఒకే మంచం

మీద పడుకుని నిద్రపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మన మొదటి రాత్రి, ముహూర్తం ఇంకో రెండు గంటలుందనగా వాడు ఓ టేప్ రికార్డర్ పట్టుకుని నా దగ్గరకు వచ్చాడు. అప్పట్లో అసలు ఎవరి దగ్గరా అవి ఉండేవి కాదు... వాడి మావయ్య జపాన్ నుంచి తెప్పించాడట.... ఆ రికార్డర్ నా చేతికిచ్చాడు..."

"బహుమతిగానా?" అడిగింది సుందరమ్మ వెంటనే.

"కాదు... ఆ టేపు రికార్డరు ఎలా పని చేస్తుందో చెప్పి - ఎలా 'రికార్డు' చేయాలో కూడా వివరించి - దానితోపాటే వాడు ఇచ్చిన ఈ క్యాసెట్టులో - మన మొదటి రాత్రి మాటలన్నీ రికార్డు చేయమన్నాడు!"

"ఛీ... పాడువేషాలు!"

"సరిగ్గా అదే మాట నేనూ వాడితో అన్నాను సుందరమ్మా!.... అయినాసరే, 'రికార్డు చేయాల్సిందే' అని వాడు పట్టుపట్టాడు... అలా చెయ్యకపోతే, ఇక జీవితంలో నా మొహం చూడనని కూడా శపథం చేశాడు..."

"అందుకని... మీరు ఒప్పేసుకున్నారు... సిగ్గులేకపోతే సరి!.... చెప్పేవాడికి వివేకం లేకపోతేపోయే - విన్నవారు మీకు విజ్ఞత వుండక్కర్లేదా?" విసుక్కుందామె...

"అలా అని కాదోయ్...! ఆ మాటకొస్తే - నాకూ అది వింతగానే అనిపించింది. ఇప్పుడంటే సీడీలు, డీవీడీలూ గట్రా వచ్చాయి కానీ అప్పట్లో అసలు ఈ టేపు రికార్డర్లూ, అందులో మాటల్నీ, పాటల్నీ రికార్డు చేసుకోటాలూ - ఎవరికీ పెద్దగా తెలియదు. అందుకే నాకు సరదా వేసింది... వాడికి వినిపించే సంగతి ఎలా ఉన్నా - మన మాటల్ని మనమే వింటే ఎలా ఉంటుందో చూడాలనిపించింది... ఆరోజు - నువ్వు గదిలోకి వచ్చేముందే - మన మంచం పక్కన ఆ రికార్డరుని ఆన్ చేసి ఉంచాను... అంతే....! అందులో మన మాటలన్నీ అలా రికార్డయిపోయాయి" గర్వంగా నవ్వుతూ చెప్పాడు రాఘవయ్య.

"హవ్వ! చేసింది చాలక మన పడగ్గది మాటలన్నీ గర్వంగా మీ ఫ్రెండుకి వినిపించారన్న మాట!" చిరుకోపం ప్రదర్శించిందామె.

"లేదులే సుందరమ్మా... వినిపించటానికి తర్వాత నాకే సిగ్గనిపించి మానేశాను. అందుకే వాడి టేప్‌రికార్డరు వాడికి తిరిగిచ్చేసి క్యాసెట్టు ఎక్కడోపెట్టి మర్చిపోయానని అబద్ధం చెప్పాను. బయట ఎక్కడవుంచినా ప్రమాదమని, దీన్ని అప్పుడు ఓ పుస్తకంలో దాచేశాను!"

"అంటే... ఇన్నేళ్లూ ఆ క్యాసెట్టు మీ దగ్గరే వుందన్నమాట!"

"చెప్పానుగా... ఏదో పుస్తకంలో దాచేశానని!... అది ఏ పుస్తకమో గుర్తులేదు. తర్వాత పెద్దగా పట్టించుకోలేదు. ఈలోగా, నా ఉద్యోగరీత్యా మనం ఊళ్లు తిరగటాలూ, ఇళ్లు మారటాలూ... ఈ హడావిడిలో అది ఎక్కడో పోయిందనుకున్నాను... వారంరోజుల

క్రితం, ఇంటికి సున్నాలు వేయించేముందు, అటకమీది పుస్తకాలన్నీ సర్దుతూంటే ఓ బైండు పుస్తకంలోంచి ఇది జారిపడింది... ఎలాగా మన యాభయ్యో పెళ్లి రోజు వస్తోంది గదా - ఆ సందర్భంగా దీన్ని నీకు 'ప్రెజెంట్'గా ఇవ్వాలనుకుని - రికార్డరు కూడా కొని తెచ్చాను... అదన్నమాట!" చెప్పటం ముగించి, తన చేతిలో ఉన్న ఆ క్యాసెట్టును మళ్లీ ఆమెకు అందించాడు.

"చెప్పొద్దూ... ఇందులో ఉన్న ఆనాటి మన మాటలు వింటూంటే నాకు చచ్చేంత సిగ్గేసిందంటే నమ్మండి!" ఆ క్యాసెట్టువైపు ప్రేమగా చూస్తూనే చెప్పింది సుందరమ్మ.

"అందుకే సుందరమ్మా! వయసు పైబడ్డాక మిగిలేవి ఆ జ్ఞాపకాలే అన్నాను... జీవితంలో మనిద్దరం చివరి మైలురాయిని చేరుకుంటున్న వాళ్ళం. ఎవరు ముందో, ఎవరు వెనకో తెలీదు కదా...ముందుగా మనలో ఎవరం వెళ్లిపోయినా రెండోవాళ్ళకి మిగిలే వ్యవధి - కొన్ని రోజులో, గంటలో... లేక నిమిషాలో ... అంతే! మనిద్దరి మనుగడ మధ్యా వ్యవధి అంతే సుందరమ్మా! ఆ కాస్త వ్యవధిలో కూడా, నువ్వో నేనో భయంకరమైన ఎడబాటుని అనుభవించక తప్పదు కదా!' - చెప్పటం ఆపి, కళ్లు మూసుకున్నాడు రాఘవయ్య.

ఆ మాటలు వినగానే, సుందరమ్మ కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

ఆ కళ్ళకు భర్త మసకమసగ్గా కనిపించాడు. "నేను మాత్రం మీరులేని ఒంటరి తనాన్ని ఊహించుకోలేనండీ... అందుకే నన్ను సుమంగళిగా తీసుకుపొమ్మని ఆ భగవంతుణ్ణి రోజూ ప్రార్థిస్తున్నాను" అంది భర్త చేతిని పట్టుకుని.

విరక్తిగా నవ్వేడు రాఘవయ్య. నెమ్మదిగా ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. "ఈ విషయంలో మాత్రం మీ ఆడవాళ్లంతటి స్వార్థపరులు మరొకరుండరేమో సుందరమ్మా! నీదారిన నువ్వు వెళ్లిపోతావ్.... మరి నేనేమైపోవాలి? నువ్వు లేని ఒంటరితనాన్ని నేను మాత్రం భరించగలననుకుంటున్నావా?... ఉండను... భరిస్తూ ఉండలేను. 'నాకు నువ్వు - నీకు నేను మాత్రమే కాదు సుందరమ్మా! నాతోనే నువ్వు... నీతోనే నేను... అంతే! అయితే మనిద్దరి ప్రయాణంలో గమ్యాన్ని చేరుకునే వ్యవధి మాత్రం రోజులో, గంటలో, నిమిషాలో అని అందుకే అన్నాను... ఆ 'ఎడబాటు నరకం'లో వున్నప్పుడు ఆ టేపులో మాటలే భగవద్గీతలవుతాయి... ఊరట కలిగిస్తాయి... దాన్ని దేవుడి గూట్లో భద్రంగా దాచిపెట్టు!" - అంటూ ఆమె చేతిని వదిలి ప్రశాంతంగా కళ్లు మూసుకున్నాడు రాఘవయ్య.

*విపుల, ఆగస్టు 2011*

★ ★ ★